# తేజోమూర్తి ★

రచన :
"రమ"

"బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి"

అని సుదూరంలో ఎక్కడో మెల్లమెల్లగా వినిపిస్తున్నై. దీర్ఘనాసిక విశాలమైన భ్రూకుటి, తేజోవంతమైన నేత్రాలు గలిగిన ఒక యువకుడు ఆ బౌద్ధసన్యాసులముందు నడుస్తున్నాడు. అతడే బుద్ధుని ప్రధానశిష్యుడు ఆనందుడు.

"పద్మ పాదా, నాకు దాహ మౌతున్నది. ప్రక్కపల్లెలోనికి పోయి మంచినీళ్ళు త్రాగి వస్తాను. నీ విక్కడే ఉంటావా?" అన్నాడానందుడు.

భిక్షువులందరూ ఆశ్చర్యపోయారు.

పద్మపాదుడు సందేహ నివృత్తి కోసం "స్వామీ! బుద్ధునివలన తమరు జితేంద్రియత పొందారుకదా! దప్పికను జయించలేరా స్వామీ!"

"పద్మపాదా! బుద్ధదేవుని జాతకకథలలో వినలేదా! బుద్ధుడు తపస్సు చేసుకొంటున్నపుడు ఫలాల నిచ్చిందని. కాని భగవానుడు వాటిని ఉపవాస నియమంచేత స్వీకరింపక "నీ దానాన్ని నా శిష్యుడు స్వీకరించి, నా ఉపదేశాన్నందించి నా సాన్నిధ్యాన్ని చేర్చుతాడ"ని వాగ్దానముచేశారుకదా. ఆమె ఇవుడు ఒక అస్పృశ్యురాలుగా ఈ పల్లెలో జన్మించింది...."

"తెలిసింది స్వామీ"

* * *

"తల్లీ, దప్పికగా వుంది. కాస్త నీళ్లు పొయ్యి" ఆనందుడడిగాడు.

"స్వామీ! తమరుచూస్తే గొప్ప సన్యాసుల్లా వున్నారు. నే నొక నీచజాతిస్త్రీని. ఈ జలాలు కూడా మాచే అపవిత్రమైనవి స్వామీ" ప్రకృతి దూరంగా తొలగి చెప్పింది.

"పిచ్చితల్లీ. పవిత్రం, అపవిత్రం వారివారి జాతులవల్ల యేర్పడలేదు. వారి మనస్సు నిర్మలమైతే అదే గొప్పజాతి, కాకపోతే నీచజాతి. త్వరగా నీళ్లియ్యి!"

"మీ మాటలు నా కర్థంకావటంలేదు స్వామీ! మే మస్పృశ్యులం. అటువంటి జాతిలో పుట్టిన నాచేతి జలాన్నెలా తాగతారు స్వామీ!"

"మీకూ మామూలు మానవులకూ తేడా యేమిటి? మిమ్మల్ని మీరు మానవులుగా గుర్తించుకొనలేకపోతున్నారు. దైవం, చిన్నా పెద్దా అంటూ యేమీ సృష్టించలేదు. ఆత్మనింద, ఆత్మహత్యకన్నా పాపం...."

"మేమూ మానవుల్లో ఒకరిమేనా స్వామీ?"

"ఆత్మపరీక్షచేసుకో నీమనస్సే నీకు జవాబు చెబుతుంది" ఆనందుడు నీళ్ళుత్రాగి, ఉపదేశంచేసి వెళ్ళిపోయాడు.

అయన వెళ్లిపోయినవైపే చూస్తూ ప్రకృతి మిట్టమధ్యాహ్నంవరకూ అలాగే ఉండిపోయింది. "ప్రకృతీ! ప్రకృతీ, ఏమిటి అందరూ వెళ్లిపోయి చాలసేపైనా నువ్వింకా అక్కడే వున్నావు. కాళ్ళూ, నెత్తి మాడటం లేదూ?"

"వస్తున్నా అమ్మా, అమ్మా! నా కిందాక ఒక బౌద్ధభిక్షువు కనుపించాడమ్మా!"

"అందులో వింతేముంది? నీ వెప్పుడూ సన్యాసుల్ని చూడలేదూ"

"ఇతను అందరిలాంటివాడుకాడమ్మా"

"ఇతనిలో గొప్పదనం యేమిటే?"

"నాకళ్ళు తెరిపించాడమ్మా"

"ప్రకృతీ, ఇవాళ నీవేదో వింతగా మాటలాడుతున్నావ్"

"లేదమ్మా, మనము సాటిమానవులలో ఎందులోనూ తీసిపోమని చెప్పారమ్మా"

"ప్రకృతీ, ఏమిటి నీ కీ విపరీతబుద్ధి? నీకు గాని పిచ్చిపట్టలేదు కదా" నిట్టూర్చి "నీ అందాన్నిచూసి మోహించి నిన్ను పొందాలని మంత్రించాడేమో! అలాగైతే మొన్న వేటకు వచ్చిన రాకుమారుడు నిన్నర్థించివెళ్లిపోయాడే అతన్నినామంత్రశక్తిచేతరప్పించమంటావా?"

"అమ్మా నువ్వు పూర్తిగా పొరపాటు పడ్డావు. అతనింకా ఏదో ఉపదేశంచేశాడమ్మా. నాకేం అర్థంకాలేదు. ఐనా అతని గంభీర ధోరణికి కట్టుబడినట్టు ఉండిపోయాను. మొఖంలోని తేజస్సు నన్ను నిలబెట్టేసింది ఆ రూపం...."

"నేను చెప్పింది నిజమే. నిన్ను మంత్రించాడమ్మా"

"అమ్మా! నేనటువంటిమాటలు భరించలేను. అతన్ని నీ మంత్రశక్తిచేత ఎలాగైనా రప్పించు."

"నీకేమైనా పిచ్చిపట్టిందేమిటి?"

"లేదమ్మా, రేపు నీళ్లడగడానికి వస్తాడు తప్పకుండా; ఎల్లుండి వస్తాడు."

"రేపు రాకపోనీ అప్పుడు చూదాం"

"రేపు తప్పకుండా వస్తాడని ఆశ వుంది"

* * *

"వచ్చాడా"

"లేదమ్మా ఏదో అవాంతరం వచ్చి ఉంటుంది?"

"పిచ్చితల్లీ...."

మూడు దినా లలా గడిచాయి.

నాలుగోరోజు తల్లిమంత్రశక్తిచేత రప్పించ నిశ్చయించుకుంది. ప్రకృతి చేతికొక అద్దాన్నిచ్చి అందులో చూడమంది.

తల్లి మంత్రించ నారంభించింది.

ప్రకృతి అద్దంలో చూస్తుంది.

ఆనందుడు భిక్షువులందరిముందు కూచుని ఉపదేశం చేస్తున్నాడు.

ఇదంతా మంత్రశక్తిగల ఆ అద్దంలో కనుపిస్తుంది.

తల్లి మంత్రిస్తుంది.

ఫలితం కనుపించలేదు.

తల్లీ కూతుళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

ఆ 'తేజోమూర్తి' చిరునవ్వుతో ఉపదేశం చేస్తున్నాడు.

ప్రకృతిలో ఓపిక నశిస్తుంది.

తల్లివైపు చూసింది. ఆమె అప్పుడు చాలా నీరసంగా కనుపించింది. కళ్లుమూసుకుని నిశ్చలంగా మంత్రం జపిస్తుంది.

ఇలా గడుస్తుంది.

ప్రకృతి అద్దంలో చూస్తునేవుంది. ఆనందుడి చలనం యేమీ కనుపించలేదు.

ఒక్కసారి తల్లి వెనుక్కు విరుచుకపడిపోయింది.

అద్దంలోంచి చూస్తున్న ప్రకృతి ఆనందుడిలో తేజస్సు నశించి భిక్షువులను వదలి తన పల్లెవైపు రావడం గమనించింది.

తల్లి తన మంత్రశక్తినేకాక ప్రాణాన్ని కూడా ఆనందుణ్ణి రప్పించడంకోసం త్యాగం చేసింది.

ఆమె మరణించింది.

ఆనందుడు ప్రకృతివద్దకు చిరునవ్వుతో వచ్చాడు. వానిమొఖంలో తేజస్సులేదు.

ఆనందుడు ప్రకృతీ—

సంఘం శరణంగచ్ఛామి,
బుద్ధం శరణం గచ్ఛామి,
ధర్మం శరణంగచ్ఛామి."

అంటూ ఆశ్రమంవైపు కదలి నడచిపోయారు. *